నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, మంగళవారం 25 జూన్ 2024 | HYDERABAD

తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఐపీఎస్‌లను బదిలీ చేసింది. ఇందులో హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా సర్ఫరాజ్ అహ్మద్‌ను నియమించింది. సోమవారం మధ్యాహ్నమే ఆయన అమీర్‌పేటలోని స్వర్ణజయంతి కాంప్లెక్స్‌లోని హెచ్ఎండీఏ కార్యాలయంలో మెట్రోపాలిటన్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. హెచ్ఎండీఏ ఉద్యోగులంతా ఆయనకు ప్రత్యేకంగా స్వాగతం పలికారు. అన్ని విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పూర్వ వైభవం వచ్చేనా?

హెచ్ఎండీఏ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సర్ఫరాజ్ అహ్మద్

సిటీబ్యూరో, జూన్ 24 (నమస్తే తెలంగాణ): ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణే లక్ష్యంగా హెచ్ఎండీఏ ఏర్పాటైంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిని మినహాయిస్తే చుట్టూ 7 జిల్లాల పరిధిలో హెచ్ఎండీఏ విస్తరించి ఉంది. హెచ్ఎండీఏలో గత నెలలుగా అభివృద్ధికి, కొత్త ప్రాజెక్టులకు నోచుకోలేదు. పైగా గత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను సైతం పక్కన పెట్టారు. ఫలితంగా హెచ్ఎండీఏ భవిష్యత్తు ఏమవుతుందా? అని ఆ సంస్థ ఉద్యోగుల్లోనే ఎంతో ఆందోళన నెలకొంది. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హెచ్ఎండీఏ చైర్మన్‌గా, పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా ఉన్నా ఆరు నెలలుగా పెద్దగా ప్రయోజనం లేకుండా పోయింది. గత ప్రభుత్వంలో హైదరాబాద్ మహానగరంతో పాటు శివారు ప్రాంతాల్లో వేల కోట్లతో ప్రాజెక్టులను చేపట్టి, నగరానికి ఎంతో ఖ్యాతిని తీసుకువచ్చింది. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా చేసింది. అలాంటి హెచ్ఎండీఏలో ఆరు నెలలుగా ప్రభుత్వం చేసిందేమీ లేదని, తామంతా ఖాళీగా ఉన్నామని, ప్రాజెక్టులు చేపట్టేందుకు డబ్బులు ఇవ్వడం లేదని వాపోయేవారు. పూర్తి స్థాయి కమిషనర్ వస్తేనే హెచ్ఎండీఏకు పూర్వ వైభవం వస్తుందని, భారీ ప్రాజెక్టులను చేపట్టడం ద్వారా దశ తిరుగుతుందనే ఆశా భావాన్ని వ్యక్తం చేసేవారు. ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణ జరగాలంటే పూర్తి స్థాయిలో దృష్టి సారించేందుకు మెట్రోపాలిటన్ కమిషనర్ అవసరమని పట్టణ ప్రణాళిక నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అసంపూర్తిగా ఉన్న బాక్స్ డ్రైనేజీపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

అసంపూర్తి పనులపై
ఎమ్మెల్యే మర్రి నిరసన

పూర్తి కాని బాక్స్ డ్రైనేజీ పనుల వద్ద ఎమ్మెల్యే, కార్పొరేటర్ ఆందోళన

నేరేడ్‌మెట్, జూన్ 24: ప్రజా సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం గౌతంనగర్ డివిజన్ రాజశ్రీనివాస్ నగర్ కాలనీ, వెంకటాద్రినగర్‌లో ఏడాదైనా పూర్తిగాని బాక్స్‌డ్రైనేజీ పనులను స్థానిక కార్పొరేటర్ మేకల సునీతా రామయాదవ్‌తో కలిసి పరిశీలించారు. ముంపు నుంచి ప్రజలను రక్షించాలని డిమాండ్ చేస్తూ పూర్తికాని బాక్స్ డ్రైనేజీ పై బైఠాయించి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీతారామయాదవ్ స్థానికులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మిర్జాలగూడ, వెంకటాద్రినగర్, రాజానగర్, రాజాశ్రీనివాస్‌నగర్, పవన్ మోటర్ ప్రాంతాలు వర్షం కురిసిన ప్రతిసారి ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. సంవత్సరం క్రితం పనులు ప్రారంభించినా నత్తను తలపించేలా సాగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళన విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ అధికారులు డీఈ లౌక్య ఎమ్మెల్యేతో మాట్లాడి విద్యుత్ స్తంభాలు బాక్స్‌డ్రైనేజీ పనులకు అడ్డుగా ఉన్నాయని వాటిని తొలగించగానే రెండు, మూడు రోజుల్లో పనులు చేపడుతామని హామీ ఇవ్వగా... వారు ఆందోళన విరమించారు.

మాట వినకుంటే..
బదిలే!

ఒత్తిళ్లలో బల్దియా ఐపీఎస్‌లు

జీహెచ్ఎంసీలో సవాల్‌గా మారిన ఉద్యోగం

సిటీబ్యూరో, జూన్ 24 (నమస్తే తెలంగాణ): శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్‌పై తీవ్ర ఆరోపణలు వస్తే ..ఏకంగా నలుగురు మంత్రులు స్పందించారు. తమరికి దగ్గరి బంధువు, కావాల్సిన వ్యక్తి అని ఉమ్మడి వరంగల్, నల్గొండ మంత్రులు చెప్పడంతో తొలగింపు ప్రక్రియ నిలిచిపోయింది. ఈ అంశం ఉద్యోగుల్లో విస్తృతంగా చర్చ జరిగింది. ఇదే జోన్‌లో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసేందుకు వెళ్లిన అధికారులపై ప్రభుత్వ పెద్దలు ఆ నిర్మాణం జోలికి వెళ్లొద్దని ఒత్తిళ్లు రావడంతో సదరు గచ్చిబౌలి డివిజన్‌లో ఉన్న నిర్మాణం జోలికి వెళ్లలేదు.. పైగా సదరు బిల్డర్ జోనల్ ముఖ్య అధికారి ఒకరికి ఆఫర్ ఇచ్చినా సున్నితంగా తిరస్కరించారు. ఎన్నో అక్రమ నిర్మాణాలు, ఓసీ (ఆక్యూపెన్సీ సర్టిఫికెట్) విడుదలలో కఠినంగా జోనల్ అధికారులు వ్యవహరించారు. గతంలో కంటే భిన్నంగా దాదాపు ఏడాదిలో ఈ జోనల్ కార్యాలయాల్లో అవినీతి, అక్రమాలకు దూరంగా సేవలు అందుతున్నాయన్న బలమైన చర్చ. కానీ ఒక్కసారిగా శేరిలింగంపల్లి జోనల్ బదిలీల్లో మార్పులు వచ్చాయి. కీలకమైన స్థానాల్లో ఉన్న ఐఏఎస్‌లు సంస్థను ఒక దారికి తీసుకువచ్చి మరింత చక్కదిద్దే సమయంలోనే బదిలీలు చేయడం పట్ల ఉద్యోగ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అవినీతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిని అందలం ఎక్కిస్తూ పోస్టింగ్ ఇవ్వడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన కార్యాలయంలో పోస్టింగ్ అంటే ఇష్టపడని సదరు అధికారి పనితీరుపై ఇటీవల కాలంలో మేయర్, కౌన్సిల్ సభ్యులు, సమీక్షల్లో మంత్రి సైతం హెచ్చరించిన కీలక స్థానాన్ని దక్కించుకోవడం వెనుక మతలబు ఏం జరిగిందన్న చర్చ విస్తృతంగా జరుగుతున్నది. సదరు అధికారికి నల్గొండ జిల్లా మంత్రి అండదండలు ఉన్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నివాసం వద్ద కూల్చివేత ఘటనలోనూ ఓ మంత్రి చెప్పాడని ముందుకు వెళ్లిన ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ఐఏఎస్ అధికారి హేమంత్ బోర్కడేపై బదిలీ వేటు పడింది. వరుసగా జరుగుతున్న పరిణామాలతో బల్దియాలో పని చేయాలంటే సవాల్‌గా మారిందని ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

• ఒకే ఐఏఎస్‌కు నాలుగు పదవులా ?

రాష్ట్రంలో తాజాగా జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో ఒక అంశం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా ఉన్న ఆమ్రపాలి నాలుగు పదవుల్లో కొనసాగడం పట్ల పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. జీహెచ్ఎంసీ కమిషనర్ పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూనే, అందుకు మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎంఆర్‌డీసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్‌గా, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, ఔటర్ రింగు రోడ్డు ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఆమ్రపాలి విధులు నిర్వహించనున్నారు. దీంతో ఒకేసారి ఆమెకు నాలుగు పదవులా అంటూ పలువురు సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు.

రొనాల్డ్ రాస్
(ట్రాన్స్‌కో, జెఎన్‌కో సీఎండీ)

ఆమ్రపాలి
(జీహెచ్ఎంసీ కమిషనర్)

స్నేహ శబరీష్
(జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్)

ఏవీ రంగనాథ్
(జీహెచ్ఎంసీ ఈవీడీఎం డైరెక్టర్)

కె.అశోక్‌రెడ్డి
(జలమండలి మేనేజింగ్ డైరెక్టర్)

న్యాలకొండ ప్రకాశ్‌రెడ్డి
(టూరిజం ఎండీ)

బల్దియాకు కొత్త బాస్‌లు

రొనాల్డ్‌రాస్ బదిలీ..

జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి

జోనల్ కార్యాలయాలకు ముగ్గురు ఐపీఎస్‌లు

ఈవీడీఎంకు రంగనాథ్

సిటీబ్యూరో, జూన్ 24 (నమస్తే తెలంగాణ): బల్దియాకు కొత్త బాసులొచ్చారు.. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ప్రభుత్వం చేసిన ఐఏఎస్ బదిలీల్లో భాగంగా జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఉన్న రొనాల్డ్‌రాస్‌ను ట్రాన్స్‌కో, జెఎన్‌కో సీఎండీగా నియమించారు. గడిచిన 15 రోజులుగా రొనాల్డ్‌రాస్ సెలవుపై ఉండటంతో ఇన్‌చార్జిగా ఆమ్రపాలి కొనసాగగా.. తాజా బదిలీల్లో ఆమ్రపాలికి జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు. వీటితో పాటు మూడు కీలక జోనల్ కార్యాలయాల్లో ఐఏఎస్ అధికారులను నియమించారు. హేమంత్ కేశవ పాటిల్‌ను ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌గా, అపూర్వ్ చౌహాన్‌ను కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా, అనురాగ్ జ్యోతిని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా నియమించారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌గా కొనసాగిన పంకజకు ఎలాంటి బాధ్యతలు అప్పగించలేదు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయి. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ (ఐటీ, రెవెన్యూ)తో పాటు శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా ఉన్న స్నేహ శబరీష్‌ను అదనపు కమిషనర్‌కే పరిమితం చేశారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్(శానిటేషన్ విభాగం)గా ఉన్న ఉపేందర్‌రెడ్డిని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా నియమించారు. కాగా జీహెచ్ఎంసీ ఈవీడీఎం విభాగం డైరెక్టర్ న్యాలకొండ ప్రకాశ్‌రెడ్డిని టూరిజం ఎండీగా నియమించారు. ఈ స్థానంలో ఏవీ రంగనాథ్‌కు జీహెచ్ఎంసీ విజిలెన్స్, విపత్తు నిర్వహణ (ఈవీడీఎం) డైరెక్టర్ బాధ్యతలు అప్పగించారు. మూడు విభాగాలుగా డీఆర్ఎఫ్‌ను విభజించి ఎస్పీ స్థాయి అధికారులతో రంగనాథ్ పర్యవేక్షణలో భవిష్యత్తులో ఈవీడీఎం సేవలు అందించనున్నది.

జలమండలి ఎండీగా అశోక్‌రెడ్డి..

జలమండలి మేనేజింగ్ డైరెక్టర్‌గా కె.అశోక్ రెడ్డిని ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకాలం ఎండీగా కొనసాగిన సుదర్శన్‌రెడ్డిని జీఏడీ ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేశారు. సుదర్శన్ రెడ్డి గత డిసెంబర్ రెండోవారంలో జలమండలి ఎండీగా బాధ్యతలు చేపట్టారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణ, కృష్ణా జలాల ఎమర్జెన్సీ పంపింగ్, ట్యాంకర్ల సరఫరాలో వినూత్న విధానాలను తీసుకువచ్చిన సుదర్శన్ రెడ్డి నీటి కొరతను అధిగమించడంలో విశేషంగా కృషి చేశారు. గతంలో జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా అశోక్‌రెడ్డి కొనసాగారు. ఈడీగా కొనసాగిన అశోక్ రెడ్డి గ్రేటర్ ప్రజలకు సేవలందించే కీలక శాఖకు ఎండీగా ఏ మేర తన ముద్ర వేసుకుంటారో అన్నది వేచి చూడాల్సిందే!

అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య బదిలీ

మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 24 : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) అభిషేక్ అగస్త్య బదిలీ అయ్యారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఆయనను బదిలీ చేశారు.

బాధ్యతల స్వీకరణ..

సిటీబ్యూరో, జూన్ 24(నమస్తే తెలంగాణ): రవీంద్రభారతిలోని పర్యాటక శాఖ కార్యాలయంలో నూతన డైరెక్టర్‌గా ఇలా త్రిపాఠి బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఆమెకు టూరిజం శాఖ ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు పలు కార్యాచరణలను అమలు చేస్తామని స్పష్టం చేశారు.

తమ సమస్యలు పరిష్కరించాలని గాంధీ దవాఖానలో ధర్నా చేస్తున్న జూనియర్ డాక్టర్లు

జూడాల సమ్మె..

రోగులకు తప్పని ఇబ్బందులు

ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నాం

సమ్మె ప్రభావం రోగులపై పడకుండా చూస్తున్నాం : వైద్యాధికారులు

సిటీబ్యూరో, జూన్ 24 (నమస్తే తెలంగాణ)/ బన్సీలాల్‌పేట : జూనియర్ డాక్టర్లు తలపెట్టిన నిరవధిక సమ్మెతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. తమ డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమవడంతో జూడాలు ఇటీవల ఇచ్చిన సమ్మె నోటీసు ప్రకారం సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగారు. దీంతో నగరంలోని పేట్లబుర్జు ప్రసూతి దవాఖాన, సుల్తాన్‌బజార్ ప్రసూతి దవాఖాన, ఉస్మానియా, గాంధీ, నీలోఫర్, ఎంఎన్‌జే, కోఠి ఈఎన్‌టీ, ఎర్రగడ్డ ఛాతీ దవాఖాన, ఎర్రగడ్డ మానసిక రోగుల దవాఖానల్లో రోగులకు ఇబ్బందులు తప్పలేదు. సాధారణంగా సెలవు తరువాత రోజులు దవాఖానల్లో రద్దీ ఉండటం సహజం. ఈ క్రమంలోనే సోమవారం నగరంలోని అన్ని ప్రభుత్వ టీచింగ్ హాస్పిటల్స్ రోగులతో కిక్కిరిసిపోయాయి. జూడాల సమ్మె మొదలవడంతో రోగులు కొంత ఇబ్బందులకు గురయ్యారు. చాలా దవాఖానల్లో రోగులకు ఓపీ చూసేది జూడాలే.అయితే జూడాలు సమ్మెబాట పట్టడంతో ఇబ్బందులు పడ్డామని పలువురు రోగులు, వారి సహాయకులు ఆరోపించారు.

ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నాం

జూడాల సమ్మెను దృష్టిలో పెట్టుకుని రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నాం. ఫ్యాకల్టీల సెలవులను రద్దు చేశాం. ఇప్పటికే సెలవులో ఉన్న ఫ్యాకల్టీలను సైతం అత్యవసరంగా వెనక్కి రప్పించాం. అన్ని విభాగాలకు సంబంధించిన ఓపీల్లో ఫ్యాకల్టీ ఉండే విధంగా ముందస్తు ప్రణాళిక రూపొందించాం. దీని వల్ల రోగులపై సమ్మె ప్రభావం పెద్దగా లేదని చెప్పవచ్చు. జూడాలు అత్యవసర విధులను బహిష్కరించలేదు.

-డా.నాగేందర్, సూపరింటెండెంట్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్

రోగులపై సమ్మె ప్రభావం లేకుండా చూస్తున్నాం

జూడాల సమ్మె ప్రభావం రోగులపై పడకుండా ఉండేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. అత్యవసర శస్త్ర చికిత్సలను ఆపొద్దని చెప్పాం. ఇందులో భాగంగా వైద్య కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, దవాఖానలోని ఆర్ఎంవోలు, ఫ్యాకల్టీలు, ఇతర వైద్యసిబ్బందితో కలిసి అత్యవసర సమావేశం ఏర్పాటు చేశాం. ఈ సమావేశంలో రోగులపై సమ్మె ప్రభావం పడకుండా చూడాలని అధికారులు, సిబ్బందికి సూచించాం. ఈ క్రమంలో అన్ని విభాగాల ఫ్యాకల్టీల సెలవులను రద్దు చేశాం. విభాగాధిపతులు, ప్రొఫెసర్‌లకు కేటాయించిన వివిధ వైద్య కళాశాలలు, హాస్పిటల్స్‌కు సంబంధించిన అన్ని రకాల ఇన్‌స్పెక్షన్ డ్యూటీలను రద్దు చేశాం. **- డా.రాజారావు, సూపరింటెండెంట్, గాంధీ దవాఖాన**

అసలేం జరుగుతోంది?

ఉసిగొల్పారా.. స్వతహాగా వచ్చారా? • మియాపూర్ భూముల వెనుక సూత్రధారి ఎవరు

ప్లాన్ ప్రకారమే చేశారా.. అనుమానిస్తున్న పోలీసులు

సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు..

బలం చేకూరుస్తున్న హెచ్ఎండీఏ జాప్యం

రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన హెచ్ఎండీఏ భూముల కబ్జా వ్యవహారం

సిటీబ్యూరో, జూన్ 24 (నమస్తే తెలంగాణ): ఒకటి కాదు, రెండు కాదు ఒకే చోట వందలాది ఎకరాలు.. అందులోనూ అవి ప్రభుత్వ భూములు. కొన్నేళ్లుగా సుప్రీం కోర్టులో వివాదం..ఆ భూములపై స్టేటస్‌కో అమలు చేయాలని న్యాయస్థానం ఆదేశాలు.. అయినా వీటన్నింటిని లెక్క చేయకుండా మియాపూర్ భూములను కబ్జా చేసేందుకు పేదలను ముందుగా ఉసిగొల్పారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లేదంటే ఒకేసారి వేలాది మంది ఆ భూముల్లోకి రావడం, రెండు, మూడు రోజుల పాటు అక్కడే ఉండి గుడిసెలు వేసి కబ్జా చేసేందుకు చేసిన ప్రయత్నాల వెనక బలమైన పెద్దలే ఉన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయాన్ని తేల్చే పనిలో పోలీసులు ఉన్నారు. ఇప్పటికే మూడు రోజులుగా జరిగిన రచ్చతో సుమారు 50 మందిపై కేసు నమోదు చేయగా, వారిలో 21 మందిని మియాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కాగా మియాపూర్ భూములు హెచ్ఎండీఏవే అయినా.. పోలీసుల విధులకు ప్రతిష్టాత్మకంగా మారింది. దీంతో అలాగే వదిలేస్తే పరిస్థితి చేజారిపోతుందని, మియాపూర్‌లోనే ఈ నెల 29వరకు 144 సెక్షన్ పెట్టి ఆ భూముల్లోంచి ప్రజలను పంపించాలని సైబరాబాద్ కమిషనర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయం పై సోషల్ మీడియాలో మియాపూర్ భూముల కబ్జా యత్నాలపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ప్రభుత్వంలోని పెద్దలే దీని వెనుక ఉన్నారన్న బలమైన ఆరోపణలు ఉన్నాయి.

పథకం ప్రకారమేనా..

ఒకే చోట పెద్ద మొత్తంలో ఉన్న ప్రభుత్వ భూముల్లోకి పేదలను పంపించడం ద్వారా ఆ భూములను కబ్జా చేయాలన్న పథకాన్ని అమలు చేసేందుకు కొందరు పెద్దలు ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు అనుమానిస్తున్నారు. 2003లోనే అప్పటి ఉమ్మడి ఏపీలోనే ఈ భూములను హుడా(హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)కి అప్పగించింది. ఆ తర్వాత హుడా హెచ్ఎండీఏగా మారడంతో ఆ భూముల పర్యవేక్షణను హెచ్ఎండీఏ ఎస్టేట్ విభాగం, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో ఈ భూములను కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నం చేస్తే అప్పటి ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరించింది. ఒక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి దాంట్లో ప్రమేయం ఉన్న వారిని అరెస్టు చేశారు. తాజాగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ మియాపూర్ భూములను ఎలాగైనా కబ్జా చేయాలన్న ఆలోచనతో ఓ పథకం ప్రకారం మహిళలను ఆ భూముల్లోకి ప్రవేశించి గుడిసెలు వేసుకునేలా ఉసిగొల్పినట్లు తెలుస్తోంది. అయితే ఏకంగా రెండు, మూడు రోజుల్లో 4వేల నుంచి 5 వేల మంది పేద ప్రజలు ఆ భూముల్లోకి వచ్చి స్థలాలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. అడ్డుకున్న పోలీసుల పై రాళ్లతో దాడి చేయడంతో పరుగులు పెట్టే పరిస్థితికి దారితీసింది. ఇలా వేలాది మంది మియాపూర్‌లోని హెచ్ఎండీఏ భూముల్లోకి రావడానికి తెర వెనక భారీ కుట్ర దాగి ఉందన్న ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. మొత్తం భూముల విలువ రూ.20వేల కోట్ల దాకా ఉంటుందని, ప్రజలను అడ్డుకొని తమ సొంతం చేసుకోవచ్చనే పథకమే ఇదని కొందరు భావిస్తున్నారు.

సాధారణ ప్రజలు ఇట్ల జేస్తరా...!

సాధారణ ప్రజలు ఇంత ధైర్యం చేస్తారా? దీని వెనక పెద్ద గూడుపుఠాణీ దాగి ఉందని కొందరు అనుమానిస్తున్నారు. గత పదేళ్లుగా కేసీఆర్ ప్రభుత్వం మియాపూర్ భూములను కాపాడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం కొల్లగొట్టే ప్రయత్నం చేస్తోందా?అనే విమర్శలు వస్తున్నాయి. దీనిపై ప్రభుత్వం ఏవిధమైన చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే. దీని వెనక వేల కోట్ల కుంభకోణమే దాగి ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మియాపూర్ భూముల పై సమగ్ర విచారణ చేసి, కబ్జాల వెనుక ఉన్న వారు ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలని నగర వాసులు డిమాండ్ చేస్తున్నారు.

బలాన్ని చేకూరుస్తున్న హెచ్ఎండీఏ జాప్యం

ఉమ్మడి ఏపీలోనే ప్రభుత్వం వేలాది ఎకరాలను హెచ్ఎండీఏకు అప్పగించింది. అప్పటి నుంచి హెచ్ఎండీఏ ఆధీనంలోనే సుమారు 8500 ఎకరాల భూములున్నాయి. అందులో కీలకంగా జవహర్‌నగర్‌లో 3వేల ఎకరాలు, మియాపూర్‌లో 550 ఎకరాలు, శంషాబాద్, రాజేంద్రనగర్, బుద్వేల్ 200 ఎకరాల భూమి ఉంది. అయితే ఈ భూములన్నింటినీ కాపాడాల్సింది హెచ్ఎండీఏనే. ఇందుకోసం హెచ్ఎండీఏలో డిప్యూటీ కలెక్టర్ ర్యాంకు కలిగిన అధికారి ఎస్టేట్ ఆఫీసర్‌గా ఉండగా, డీఎస్‌పీ స్థాయి అధికారి పోలీసు శాఖ నుంచి ఎన్‌ఫోర్స్‌మెంటు విభాగం అధికారిగా ఉన్నారు. వీరి కింద ఆయా భూములను ప్రతి రోజూ పర్యవేక్షించేందుకు ఏడుగురు సైట్ ఆఫీసర్లు, వీరికి మద్దతుగా సీఐ, ఎస్ఐ, కానిస్టేబుల్స్ విధులు నిర్వహించాల్సి ఉంటుంది. మియాపూర్ భూముల రక్షణలో హెచ్ఎండీఏ సరైన చర్యలు తీసుకోకపోవడంతోనే వేలాది మంది అక్కడికి వచ్చేందుకు దారి తీసిందనే ఆరోపణలున్నాయి. నెల రోజుల నుంచే మియాపూర్ భూముల్లో పాగా వేసేందుకు ప్రయత్నాలు చేసినా సమర్థవంతంగా అడ్డుకోకపోవడంతోనే ఈ ఘటన జరిగిందనే విమర్శలున్నాయి. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన వారే కొందరికీ సహకరిస్తుండటం వల్లే ఇలా జరుగుతోందని, పరిస్థితి తీవ్ర రూపం దాల్చే దాకా వెళ్లిందని పలువురు ఆరోపిస్తున్నారు.